పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పీజేఆర్ నగర్‌లో ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్ కాలనీలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు కూడా మొదలు పెడతామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, సీహెచ్.భాస్కర్, షౌకత్ అలీమున్నా, యాదగిరి, బాలస్వామి, సంగమేష్, అగ్రవాసు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్

కూకట్‌పల్లి: పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి బి. తిరుపతి అన్నారు. కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం మండల్ లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టులో కేసులు వేసి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కేసుల పరిష్కారానికి 12 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పలు కేసుల్లో 32 కేసులను రాజీమార్గంలో పరిష్కరించామన్నారు. మల్కాజ్‌గిరి జిల్లా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పరిధిలోని కోర్టుల్లో 4032 కేసులు, రంగారెడ్డి 6వ జిల్లా అదనపు న్యాయమూర్తి పరిధిలోని కోర్టుల్లో 6055 కేసులను రాజీమార్గంలో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ కుమార్‌గౌడ్, 12 మంది జడ్జీలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లడ్డూపై రాజకీయం చేయడం తగదు



మూసాపేట: భరత్‌నగర్‌లోని హరిహర క్షేత్రంలో శనివారం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభిమానులు దేవిరెడ్డి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దేవునిపై రాజకీయం చేయకూడదని హితవు పలికారు. లడ్డూ అపవిత్రం అంటూ ఎంతోమంది భక్తుల మనోభావాలను దెబ్బతీయటం తగదన్నారు. కార్యక్రమంలో ప్రసాదరెడ్డి, హరినాథ్ రెడ్డి, రాజుల ప్రసాద్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్, సాగర్, నరేంద్ర రెడ్డి, పవన్, శివ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఆల్విన్‌కాలనీ: కాలనీ అభివృద్ధిలో అసోసియేషన్‌లు భాగస్వాములవ్వాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా ఎన్నికైన హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శనివారం కార్పొరేటర్‌ను కలిశారు. నూతన కమిటీని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.బాబూరావు, జనరల్ సెక్రటరీ యాదిరెడ్డి, జాయింట్ సెక్రటరీ సీహెచ్. వెంకట్రామరెడ్డి, ట్రెజరర్ మదన్‌మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్‌రావు, ఆర్గనైజింగ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ రామనాథం, జోనల్ ఎగ్జిక్యూటివ్‌లు కేఎస్ఆర్ చౌదరి, బసవ లింగయ్య, శంకర్‌రావు, ప్రకాష్ పాల్గొన్నారు.

అవంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో అపోలో హాస్పిటల్, అవంతినగర్ తోట సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, నేత్ర, దంత, చర్మ పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.

ప్రగతి కళాశాలలో బతుకమ్మ వేడుకలు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణతో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. అధ్యాపకుల పర్యవేక్షణలో తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి నాలాలో పడి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి మురునీటి నాలాలో పడి మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మధిర పరిధిలోని రాయపట్నం గ్రామానికి చెందిన శివదాసు అచ్యుతరావు, బిజ్జగాని సుగుణ రాజు, కస్మపాసాటి కొండయ్య (35)లు స్నేహితులు. మరో స్నేహితుడు అశోక్ దొంగతనం కేసులో జైలులో ఉన్నాడు. అశోక్ బెయిల్‌కు షూరిటీ ఇచ్చేందుకు శుక్రవారం కూకట్‌పల్లి కోర్టుకు వచ్చిన శివదాసు అచ్చుతరావు, బిజ్జగాని సుగుణరాజు, కస్మపాసాటి కొండయ్యలు సాయంత్రం వరకు అడ్వకేట్ ద్వారా ప్రయత్నించినప్పటికీ సోమవారం వరకు వాయిదా పడింది. దీంతో తిరిగి ఊరికి వెళదామనుకుంటున్న సందర్భంలో కొండయ్య బహిర్భూమికి వెళ్లివస్తానని వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అతడి కోసం చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. సెల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ ఉండటంతో చేసేదేమీ లేక రాత్రి అంతా వేచి చూసి తిరిగి శనివారం ఉదయం కోర్టు చుట్టు పక్కల ప్రాంతంలో వెతకగా.. సమీపంలోని మురుగునీటి కాలువలో కొండయ్య మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హృద్రోగ సమస్యలతో పెరుగుతున్న మరణాలు



సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సంగీతారెడ్డి



మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో..

- హెచ్ఐసీసీలో హృదయ సంబంధిత వ్యాధులపై సమ్మిట్
- పాల్గొన్న అపోలో ఆస్పత్రి ఎండీ సంగీతారెడ్డి

మాదాపూర్: హృద్రోగ సమస్యలతో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని అపోలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం హృదయ సంబంధ వ్యాధులపై నిర్వహించిన సమ్మిట్‌లో ఆమె మాట్లాడుతూ గుండెపోటుతో మరణించే వారి సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు, ప్రజలు శిక్షణ పొందడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ భారతదేశంలో మొదటి అంతర్జాతీయ శిక్షణా కేంద్రాన్ని హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌కేర్ క్వాలిటీ సమ్మిట్ 2024 చైర్ పర్సన్ డాక్టర్ ఇమ్రాన్ సుభాన్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సచిన్‌మీనన్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆసుపత్రిలో..

యువత కూడా గుండె జబ్బుల బారిన పడుతున్నారని డాక్టర్ అనిల్‌కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో ఈడీ(ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్) డివైస్‌ను శనివారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలన్నారు. మెడికల్ డైరెక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఏఈడీలతో మరణాల శాతంను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

శేరిలింగంపల్లి: చిన్న వయస్సు వారికి కూడా హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రథమ చికిత్స అవసరం అని డాక్టర్ దీపక్ చెప్పారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సిటిజన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీలో వాకర్స్, స్థానికులకు సీపీఆర్‌పై శనివారం అవగాహన కల్పించారు.

పేదలను భయభ్రాంతులకు గురి చేయొద్దు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీనగర్‌లో పర్యటన
- డ్రోన్ కెమెరా ఎగరవేతపై పీఎస్‌లో ఫిర్యాదు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: హైడ్రా పేరుతో పేదలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్ నగర్‌లలో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి శనివారం పర్యటించారు. వారం రోజులుగా డ్రోన్ కెమెరాలతో భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికుల ఫిర్యాదుతో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శనివారం వచ్చిందంటే చాలు హైడ్రా వారు ఎప్పుడు వచ్చి తమ ఇళ్లను కూలగొడతారో అని పేదలు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో రాజీవ్ గాంధీ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు డ్రోన్ కెమెరాలు ఎగరవేయటం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ ఇళ్లను కూల్చివేస్తారనే భయంతో ఇప్పటికే రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్‌నగర్‌లలో నివసిస్తున్న ముగ్గురు నిరుపేదలు ఉరేసుకున్నారని గుర్తు చేశారు. డ్రోన్ కెమెరాల ఎగరవేతపై పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో లింగయ్య, ఐలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, రమేష్, రాంబాబు, మల్లేష్, నరసింహారెడ్డి, షేక్ రఫీక్, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాలు ఎగరడంపై ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భరత్‌నగర్‌లోని సెయింట్ గ్జేవియర్స్ స్కూల్ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



మూసాపేట: కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. భరత్‌నగర్‌లోని సెయింట్ గ్జేవియర్స్ స్కూల్ (బాల్‌రెడ్డి స్కూల్)లో 1985 నుంచి 2007 వరకు చదువుకున్న 22 బ్యాచ్‌లకు చెందిన సుమారు 500 మంది 10వ తరగతి పూర్వ విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ తమ వయస్సును మరిచి కుళ్ల జోకులు.. అనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. దేశ, విదేశాల్లో ఉన్నటువంటి వారందరూ ఒక చోటకు చేరి ఆనాటి గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1993 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు

రేబిస్ నివారణకు కృషి చేయాలి



వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యురాలు సంధ్యారాణి, సంధ్య తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశు వైద్యురాలు సంధ్యారాణి, సంధ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ జునోసిస్ డే సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని పశువుల వైద్యశాలలో ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌ను జంతువులకు ఇచ్చారు. ఈ సందర్భంగా పశు వైద్యురాలు సంధ్యారాణి యూపీహెచ్‌సీ డాక్టర్ దీప్తితో కలిసి రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెంచుకునే కుక్కలకు, జంతువులకు వాటి యజమానులు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో రామచందర్, దివ్య, జ్యోతి, యోగానంద్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార విద్యపై అవగాహన



కూకట్‌పల్లి: మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు మాట్లాడుతూ.. జిల్లాలో 73 ప్రభుత్వ ఉన్నత, 8 ప్రైవేట్ పాఠశాలల్లో కౌమార విద్యపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కౌమార దశలో బాలబాలికలకు కలిగే శారీరక, మానసిక ఉద్వేగ పరమైన మార్పుల గురించి అవగాహన కల్పించామన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి ఇతర ప్రమాదకర ప్రవర్తనలకి ఉన్న సంబంధాలను, లైంగిక వేధింపులు, భావ వ్యక్తీకరణ ద్వారా వ్యక్తుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవటంపై అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం జరిగిన పోస్టర్ మేళాలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం అధికారి రమేష్ సంజీవ, ఎంఈఓలు హరిశ్చందర్, కిషన్, భాగ్యమణి, ఎస్‌సీ ఈఆర్‌టీ ఫ్యాకల్టీ మధుసూదన్ రెడ్డి, కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, హెచ్ఎం నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు



దేశభక్తి, జానపద బృంద గాన పోటీలు



పాట పాడుతున్న విద్యార్థినులు

మూసాపేట: కూకట్‌పల్లి ఎస్ఆర్‌సీ గార్డెన్‌లో శనివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో దేశభక్తి, జానపద బృంద గాన పోటీలు హిందీ, తెలుగు, సంస్కృతంలో నిర్వహించారు. సుమారు 37 పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు వారికి దేశ భక్తి పట్ల గౌరవం పెరుగుతుందని అన్నారు. సంస్కృతం, హిందీ, తెలుగుల్లో జానపద గేయాలను పాడటంతో భాషపై మక్కువ, గౌరవం పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేశ్వరరావు, యాదగిరి, పంచశీల శ్రీనివాస్, మూర్తి, సుకృత్ కుమార్, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చమ్మ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- ఒక శాడిస్టులాగా సీఎం సంతోషిస్తున్నాడు
- అధికారం శాశ్వతం కాదు
- ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో శుక్రవారం ఉరివేసుకొని మృతి చెందిన బుచ్చమ్మ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, రవికుమార్ యాదవ్‌లతో కలిసి మృతదేహం వద్ద శనివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా అధికారులు వందల మంది పోలీసులతో వచ్చి అనేకమంది ఇళ్లను కూల్చివేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారన్నారు. పట్టా భూమి మీదకు వచ్చి షెడ్లు కూలగొట్టే అధికారం వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. అదే విధంగా బుచ్చమ్మ దంపతులు తమకు ఉన్న భూమిని కూతుర్లకు కట్నం కింద ఇచ్చారని, ఆ భూమి తమకు రాదని ఆందోళనకు గురై ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పేదవారికి కంటిమీద కునుకు లేకుండా బ్రతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శని, ఆదివారం వచ్చిందంటే పొయ్యి మీద కుండ పెట్టకుండా దిగాలు పడి బ్రతుకుతున్నారన్నారు. 45 రోజులుగా నల్ల చెరువు, హస్మత్‌పేట చెరువు, కూకట్‌పల్లి చెరువు, బోరబండ చెరువు, ఫిర్జాదిగూడ చెరువు అనేక చెరువుల్లో వందల ఇళ్లను కూల్చివేశారన్నారు. ఎవరికీ నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని, మేము సుప్రీం అంటూ మాకు రేవంత్ రెడ్డి అండగా ఉన్నారని అధికారులు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఏడిపించి వారి కళ్లల్లో కన్నీళ్లు చూసి ఒక శాడిస్ట్ లాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషపడుతున్నారని, నిజాం రాజులాగా వ్యవహరిస్తున్నారన్నారు. కేవలం వారి అధికారం 5 సంవత్సరాలే అని, శాశ్వతం కాదని అన్నారు. హామీలను అమలు చేసే దమ్ము లేక ప్రజలను పక్క దోవ పట్టించి వేల కోట్లు సంపాదించుకునే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కుమార్‌యాదవ్, మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బుచ్చమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఆహ్లాదం అందించే తాజ్‌మహల్ ఎగ్జిబిషన్



తాజ్‌మహల్ నమూనా





విదేశీ పక్షులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో 'తాజ్‌మహల్' ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాజారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు ఆకట్టుకునేలా ఆగ్రాలో ఉన్న తాజ్ మహల్ నమూనాతో పాటు ముఖద్వారంగా ఎర్ర కోటను నిర్మించామని తెలిపారు. అదే విధంగా 60 రకాల లైవ్ బర్డ్స్, 30 రకాల అమ్యూజ్‌మెంట్ రైడింగ్స్, వందకు పైగా హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్స్ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనితో పాటు వివిధ రకాల రుచికరమైన తినుబండారాల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు పిల్లలు, పెద్దలు కుటుంబ సమేతంగా ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, జావేద్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం పరిశీలన

మూసాపేట: ఖైత్లాపూర్ నుంచి హైటెక్ సిటీ వెళ్లే రహదారి రోడ్డు విస్తరణ కోసం జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైటెక్ సిటీ వెళ్లే రహదారిలో నిత్యం ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మఠం వారి సాయంతో 100 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేసుకున్నట్లయితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని వివరించారు. అందులో భాగంగానే 100 ఫీట్ల రోడ్డు పనులు చేయడానికి గత ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు వెడల్పు చేయటానికి మఠం వారు జీహెచ్ఎంసీకి కావల్సిన స్థలాన్ని ఇవ్వడానికి అంగీకరించారన్నారు. కానీ ఐడీఎల్ కంపెనీ వారు రోడ్డు వెడల్పు చేయకుండా అడ్డుకుంటున్నారని, సోమవారం వరకు ఐడీఎల్ అధికారులు రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ బాబూరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్, బీజేపీలవి శవ రాజకీయాలు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: బుచ్చమ్మ మరణాన్ని అడ్డుపెట్టుకొని హైడ్రా మీద స్థానిక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శవ రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో, చెరువుల్లో ఇళ్లు నిర్మిస్తే తప్పకుండా కూల్చివేతలు కొనసాగుతాయన్నారు. బుచ్చమ్మ ఇంటికి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారన్నారు. ఆమె మరణంపై విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పారెడ్డి, జ్యోతి, లక్ష్మయ్య నరసింహయాదవ్, సుధాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సిద్దార్థ కళాశాల ఉమెన్స్, కో ఎడ్యుకేషన్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం అశోక గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుక, ఉత్తీర్ణత పొంది వెళ్తున్న విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.నాగయ్య, కళాశాల ప్రెసిడెంట్ జి.భాస్కర్ రావు, కళాశాల డైరెక్టర్లు మధుసూదన్ రావు, ఎస్.అరవింద్‌రావు, విష్ణువర్ధన్, కళాశాల సెక్రటరీ జి.భగత్, ప్రిన్సిపాల్స్ పద్మప్రియ, ఎస్. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ సందర్భంగా కూకట్‌పల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శైలేష్ కుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు